# ప్రతిఫలం

- పాలడుగు వెంకటేశ్వర రావు



విశాఖ పట్నం ఆంధ్రా యూనివర్సిటీలో చేరిన కొత్తల్లో, విశ్వం తన తండ్రి తాతబ్బాయికి ఒక వుత్తరం రాశాడు. ఆ వుత్తరంలోని కొన్ని ముఖ్యాంశాలు:

'నాన్నగారూ, ఇప్పుడిప్పుడే నేను ఇక్కడ యూనివర్శిటీ వాతావరణానికి అలవాటు పడుతున్నాను. కొంతమంది మంచి స్నేహితులు దొరికారు. బాగా కష్టపడి చదువుతున్నాను. నా ధ్యేయం నేను ఎప్పుడూ మరిచిపోను. నా చదువు గురించి అందుకు అవసరమయిన డబ్బు గురించి, మీరు ఎన్నెన్ని కష్ట నష్టాలు పడుతున్నారో, అర్ధాకలితోనే వుంటూ ఏ రకంగా రెక్కల్ని ముక్కలు చేసుకుంటున్నారో, ఎన్ని అవమానాల్ని భరిస్తూ వున్నారో నాకు బాగా తెలుసును.

మీ ఋణాన్ని ఎన్ని జన్మలు ఎత్తినా, ఏమి చేసినా, తీర్చుకోలేనన్న గ్రహింపు నాకుంది. మిమ్మల్ని అమ్మనీ చూడాలని నాకు ఎంతో ఇదిగా వుంది. కానీ, చదువు ముఖ్యమని మీరు అన్న మాటలు నాకు గుర్తున్నాయి. అందుకే సెలవులకి నేను మన వూరు రావటం లేదు. అమ్మ, మీరు, మన వూరు ఎల్లప్పుడూ నా మనస్సులో మెదు లుతూ వుంటారు. గుండె ఆర్ద్రమై, నా కన్నులలో నీరు చిప్పిల్లుతూ వుంటుంది. మన వూరే నా దేవా లయం. మీరే నా దేవుళ్ళు. నాన్న గారు! గుండెను దిటవు పరచుకుని ధైర్యంగా ముందుకు సాగటానికి ప్రయత్నిస్తున్నాను.

**ఆ తర్వాత కొన్నేళ్ళకి విశ్వం తన తండ్రికి రాసిన కొన్ని వుత్తరాల్లోని ఒక వుత్తరంలోని కొన్ని ప్రధానమ యిన అంశాలు:** 'నాన్నగారు. కాలం ఎంత వేగంగా పరుగులు తీస్తుంది! ఈ జీవితాల్లో ఎన్నెన్ని మార్పుల్ని తీసుకుని వస్తుంది!! పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ, యూనివర్శిటీకే ఫస్టుగా పూర్తి చెయ్యటం, వెంటనే ఒక పెద్ద కంపెనీలో ఆఫీస రుగా హైదరాబాదులో సెటిలవటం నా జీవితంలో అనుకోని మార్పు అయితే, మీ ప్రయత్నం ఫలించి పద్మతో నా వివాహం జరగటం నా అదృష్టంగా భావిస్తాను. మా కాపురం అందంగా కొత్త కొత్తగా వుంది. పద్మ చాలా మంచి అమ్మాయి. నేనంటే ప్రాణం! నాకూ తనంటే అంతే. నాది బాధ్యత గల పెద్ద వుద్యోగం. మంచి జీతం. ఇల్లూ, కారూ, నౌకర్లూ కంపెనీ వారే ఇచ్చారు. పని ఎక్కువగానే వుంటుంది. నాకు అదేమంత కష్టమనిపించదు. అమ్మా మీరూ ఇక్కడికి వచ్చి కొన్నాళ్ళు మా దగ్గర వుండమంటే, ఆ వూరు వదిలి రానంటారు మీరు! అమ్మకి ఈ మధ్యన ఆరోగ్యం అంత బాగుండటం లేదని, నన్ను చూడాలని అంటున్నదనీ- రాశారు. నాకూ రావాలని వుంది, కాని పని వత్తిడి వలన రాలేకపోతున్నాను. అమ్మని మంచి డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళి చూపించండి. ఆరోగ్యం గురించి మీరి ద్దరూ మరింత శ్రద్ధ తీసుకొనవలసిన అవసరం వుంది. మనీ ఏమయినా కావాలా? పంపించమంటే పంపుతాను.'

**ఆ పిదప మరి కొన్ని సంవత్సరాల తర్వాత తండ్రి రాసిన జాబులకి జవాబుగా విశ్వం, తాతబ్బాయికి రాసిన వుత్తరంలో కొన్ని కొత్త అంశాలు:** 'నాన్న గారు, మీరు రాస్తున్న వుత్తరాలన్నీ నాకు అందు తూనే వున్నాయి. ప్రతీ వుత్తరానికీ సమాధానం రాయటం నాకు కుదరటం లేదు. ఇటీవల నాకు ప్రమోషన్ వచ్చింది. పని మరింత పెరిగింది. నా కొడుకు నరేన్ కొంచెం పొడుగయ్యాడు. వాడు బాగా కబుర్లు చెపుతాడు. అచ్చం వాడు 'పద్మ నాన్నగారి' పోలిక. ఎర్రగా వుంగరాల జుట్టుతో బుడ్డాడు ముద్దుగా బొద్దుగా అందంగా వుంటాడు. నాకూ పద్మకీ వాడంటే పంచ ప్రాణాలు. వాడు మా కొడుకుగా పుట్టటం అదృష్టం అనుకుంటున్నాము! వాణ్ణి చూడటం ఇంతవరకూ మీ ఇద్దరికీ కుదర లేదు. అమ్మ ఆరోగ్యం బాగా దెబ్బతిన్నదనీ, మంచం దిగటం లేదనీ, రాశారు. ఎందుకని అశ్రద్ధ చేశారు?! ఆరోగ్యం ముఖ్యం కదా! నేను అక్కడికి వచ్చి మీ ఇద్దరి మంచి చెడ్డలు చూడాలంటే కుదిరే పని కాదుగదా! ఎవరి సంగతి వారు చూసుకోవాలి కదా!- మీకు నేను చెప్పేదేముంది? మనీ పంప మని మీరు రాశారు. నిజమే. పంపుదామనుకు న్నాను. వెంటనే పంపటం కుదరలేదు. ఆ తర్వాత ఆ సంగతి మరిచిపోయాను. ఏమీ అనుకోకండి.'

**మరుసటి ఏడాది తాతబ్బాయి నుంచి వచ్చిన ఎన్నో వుత్తరాలకి బదులుగా విశ్వం రాసిన ఓ వుత్తరం లోని కొన్ని విచిత్రమయిన అంశాలు:** 'నాన్న గారూ, అమ్మ ఆరోగ్యం ఏమీ బాగుండటం లేదని, మీ ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే వుంటు న్నదనీ తెలిపారు. మీరు కోరినట్లుగా ఒకసారి వచ్చి అమ్మనీ మిమ్మల్నీ చూసి వెడదామని అనుకు న్నాను. కాని వీలవలేదు. అన్యథా భావించకండి. వార్ధక్య దశలో ప్రతి మనిషీ కొన్ని వూహించని విప త్కర పరిస్థితులను ఎదుర్కొనవలసి రావచ్చని, ఆ మధ్యన మా మామ గారి దగ్గర నుండి వచ్చిన ఫోను సమాచారం వలన నాకు అవగతమయ్యింది. మా మామగారికి 'హార్ట్ ఎటాక్' వచ్చి, హాస్పట ల్‌లో చేర్చారన్న కబురు నాకు తెలియగానే, సెలవు పెట్టి పద్మనీ, నరేన్‌నీ తీసుకుని వాళ్ళ వూరు వెళ్ళాను. నెల రోజులు వుండి స్వయంగా మంచీ చెడూ చూశాను. భగవంతుడి దయవలన ఆపరే షన్ సక్సెస్ అయి ఆయన కోలుకున్నారు. ఇప్పుడు ఆయన బాగానే వున్నారు. మామ గారు, అత్తగారు చాలా వుత్తములు. దగ్గరుండి, అన్నీ స్వయంగా నేను చూసుకున్నందుకు వారిద్దరితోపాటు, పద్మ కూడా ఎంతో ఆనందించి, కృతజ్ఞతలు తెలిపింది. వాళ్ళకి మాత్రం చూసుకోవటానికి ఎవరున్నారు?- అల్లుడ్నయినా లేక కొడుకునైనా నేనే గదా! మీ ఇద్దరి ఆరోగ్యాలు జాగ్రత్తగా చూసుకోండి.'

ఆ తర్వాత విశ్వం నుండి వుత్తరాలు రావటం బాగా పలచబడి, చివరికి అదీ ఆగిపోయింది. కొన్నాళ్ళకి తాతబ్బాయికి భార్యా వియోగం అయ్యింది. విశ్వం కోసం మనిషిని పంపితే, క్యాంపుకి వెళ్ళి ముంబాయిలో వున్నాడని తిరిగి వచ్చాడు వెళ్ళిన మనిషి. అంతా అయిపోయి, చాలా దినాలు అయినా, విశ్వం జాడ లేకపోయేస రికి, అది తన యొక్క బాధ్యతగా గుర్తెరిగి, చివరి సారిగా విశ్వానికి ఒక వుత్తరం రాసి పడేశాడు తాత బ్బాయి:

'నాన్నా! విశ్వం. క్షేమంగా వున్నావని ఆశిస్తాను. కోడలూ, మనవడూ కులాసాగా వున్నారని తలు స్తాను. నీ కోసం, నిన్ను చూడాలని కలవరిస్తూనే ఆ పిచ్చి తల్లి వెళ్ళిపోయింది. నీ కోసం మనిషిని పంపిం చాను. అతను వట్టి చేతులతో తిరిగి వచ్చాడు. పని వత్తిడి వలన నీవు రాలేక పోయావని అర్థం చేసుకు న్నాను. కన్న పిల్లల కోసం, వారి బాగు కొరకు, ఇతర ప్రాణుల్లాగే మానవుడు కూడా ఎన్నో ప్రయ త్నాలు చేసి, ఎటువంటి త్యాగానికైనా సిద్ధపడ తాడు. ఆ త్యాగం ప్రతిఫలాన్ని కోరకూడదు. కోరు కుంటే దాని ఔన్నత్యం దెబ్బతిన్నట్లే. నీ నుంచి నేను, నీ తల్లీ ఎటువంటి ప్రతిఫలమూ కోరుకో లేదు. అయితే- ఒక కన్న పేగు, తన సంతానా న్నుంచి పిసరంత ప్రేమని ఆశిస్తే, అది ప్రతిఫ లంగా పేర్కొనబడుతుందా, కన్నతండ్రీ?! రెక్కలు వచ్చిన పిల్లలు ఎగిరిపోయి, కొత్త గూళ్ళు, కొత్త సంసారాలు నిర్మించుకొనటం సహజమే. నేను, నాది- అన్న భావనలో మాయ వున్నదనీ, చివరికి మిగిలేది ఏమీ వుండదనీ అవగతమవటానికి కొంద రికి ఒక జీవిత కాలం కావలసి రావటం దురదృష్టక రమయిన అంశం. పిల్లల గురించి కన్నవాళ్ళు చేసిన కష్టమంతా ఒక బాధ్యత మాత్రమే! ప్రతిగా ఏదో ఆశించటం అన్న కోరికని పెంచుకుంటే- అది చివ రికి మిగిల్చేది కొండంత దుఃఖాన్నే! అటువంటి పరి స్థితి, నీకు ఎదురుకారాదని- ఒక తండ్రిగా, కోరు కుంటూ, నీకు ఆయురారోగ్యాలు, మనశ్శాంతి ఇవ్వాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ- ఇక వుంటా నాన్నా.'

ఆ వుత్తరం చదివిన విశ్వం, చాలాసేపు కూర్చున్న చోటనే విగ్రహంలాగ వుండిపోయాడు. అప్రయత్నంగానే అతని కన్నులలో నుండి నీరు వుబికి ధారలు కట్టింది.

✱

